


సౌమ్య
దీపావళి
కథల పోటీలో
మూడవ
బహుమతి
పొందినది

పెళ్ళకూరు జయప్రద

*"నువ్వు పుట్టినప్పుడు నేను లేను. నువ్వు పోయేనాటికి నేను ఉండను. ఈ నాలుగునాళ్ళ నా పరిచయానికే కన్నీళ్ళు కారుస్తున్నావా?" అంది అనూ తల్లి. మధురమైన జీవితాన్ని అర్థంలేని ఆలోచనలకు, ఎడతెగని పిపాసకు బలిపెట్టుకుంది. జిజ్ఞాసతో మనసును కాల్చేసుకుని తన జీవితకాలాన్ని కుంచించుకుందామె. అయినా మమకారాన్నే మిగిల్చి పోయింది, మరి!*

అయిపోయింది. అంతా అయిపోయింది. ఏ అనుభవాలు ఆ పసిపిల్లను అంత విజ్ఞానవతిగా చేశాయో, ఆ అనుభవాలే ఆ పిల్లను చావు కంత దగ్గరగా తీసుకు వచ్చాయి. తన చేతులలో పెరిగి, అనుభవాల పుట్టగా మారి తనకే గురువయిన తన అన్న కూతురు బరువయిన ప్రాణం అతి తేలికయిన అనంత వాయువుల్లో కలిసిపోయిం దీనాడు.

అంతగా ఆలోచించి అనుపమ ఏమి మిగుల్చుకో గలిగింది? ఆమె మృతదేహం చుట్టూ చేరి కన్నీళ్లు కార్చే ఈ ప్రజానీకం సానుభూతి మిగుల్చుకుందా? ఆమె జ్ఞాపకాలు వీళ్ల హృదయాల్లో ఎన్ని రోజులు పదిలపరచ బడతాయి?

చితికి దూరాన, అతి దూరాన మట్టిలో మోకాళ్ళు ముడుచుకుని కూర్చున్న అతనికి, తనకు దూరంగా చితికి దగ్గరగా, మరీ దగ్గిరగా ఏడుపు వినిపిస్తోంది

"నాన్నా! అమ్మ కావాలి!" వెక్కివెక్కి ఏడుస్తున్న శబ్దం. ప్రతి బిడ్డా కోరే అతి సామాన్యమైన కోరిక.

"నాకూ కావాలి, పాపా! అమ్మ నాకూ కావాలి. కానీ ... కానీ ... తిరిగి రాదు. తిరిగి రా దిక." పసిపిల్ల నాలిశా కూతురును పెనవేసుకుని ఏడుస్తున్న శబ్దం. అది కొన్ని సంవత్సరాల క్రితం పరిచయమయిన స్వరం; తాగుడు మైకంలో గతి తప్పిన ఒకనాటి స్వరం.

చుట్టూ సాగ. దానికివెనక మసక మసగ్గా మనుష్యులు. కపాలం బ్రద్దలయిన శబ్దం. కదిలిపోతున్న బంధువుల తాలూకు నీడలు. ఆ తరవాత అంతా నిశ్శబ్దం. ఆ భయంకరమైన నిశ్శబ్దంలో అతనికి ఉన్నట్లుండి ఏదో కొత్తగా గుర్తు వచ్చినట్లయింది.

"నిజం! ఇక అనుపమ తిరిగి రాదు. కష్టాలలోనూ, సుఖాలలోనూ తనను వెన్నంటి, అతి భయంకరమైన నిజాలు చెప్పే అనుపమ ఇక తిరిగి రాదు. తనను 'బాబాయ్!' అని అతి ప్రీతిగా పిలవడానికి తన అన్న కూతురు ఇక లేదు." సర్వం పోగొట్టుకున్న ఆ బాటసారి కళ్లగుండా ముత్యాల్లాంటి నీళ్లు జారిపోతున్నాయి.

"బాబాయ్!" ఎక్కడినుండో పిలుపు.

"అతి సామాన్యమైన ఆ చావుకు అతి దీర్ఘంగా ఆలోచిస్తున్నావేమిటి, బాబాయ్?"

తన చెంపలమీద చల్లటి వేళ్ల స్పర్శ. అందిన వాత్సల్యపూరితమైన ఆ వేళ్లను పట్టుకోవాలని ఆరాటం. కానీ, అంతా భ్రమ. వేడి కన్నీళ్లు అంతకంటే వేడిగా ఉన్న చెంపలమీద చల్లగా తగిలాయి.

'అనూ తల్లీ!' నిట్టూర్చా డతను. కాలగ్రంథంలోని తనకు తెలిసిన అనుపమ తాలూకు రెండు పుటలను మననం చేసుకుంటూ నడవసాగా డతను — శ్మశానానికి దూరంగా, ఊరికి దగ్గరగా.

• • •

తల్లి పోయినప్పుడు అందరూ ఏడుస్తూంటే మూడేళ్ల పసికూన అయిన అనుపమ బెదరలేదు. బాబాయి దగ్గరకు పరుగు పరుగున వచ్చి కుతూహలంగా అడిగింది:

"ఎందుకు, బాబాయ్, అందరూ ఏడుస్తున్నారు?"

వదిన స్మృతులు కలవరపెడుతూ ఉండగా, ఆ పిల్లను హృదయానికి అదుముకుని చెప్పాడు:

"మీ అమ్మ ఇంక తిరిగిరాదు, అనూ!"

ఆ పిల్ల కొద్దిసేపు మాట్లాడలేదు. బాబాయ్ చేతుల్లో నుండి తప్పించుకుని తన లేతవేళ్లతో అతని కన్నీళ్లను తుడుస్తూ అంది:

"పోనీలే, బాబాయ్!" ఆమె కనుపాపల్లో తన నీడ చూసుకుని ఉలిక్కిపడ్డా డతను. చావుపుట్టుకల రహస్యం అంతా తనకు తెలిసిపోయినట్టు ఒక్క మాటలో చెప్పిన తన అన్న కూతురు వంక ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయాడు. ఆ తరవాత ఆమె దగ్గర అలా ఆశ్చర్యపోయిన క్షణాలు చాలా ఉన్నాయి.

తన గుండెల మీద చేరి కథలు వింటూ వింటూ ముఖం చిట్లించి వెంటనే పక్కున నవ్వింది పదేళ్ల అనుపమ ఒక రోజు.

"భలే, బాబాయ్! తమ్ముణ్నీ, భార్యనూ కష్టాలు పెట్టి మొత్తానికి మంచి పేరు సంపాదించుకున్నాడు శ్రీరాముడు."

"ఆదేమిటి! తండ్రిమాట కొరకు శ్రీరాముడు కానలకు వెళ్లాల్సి వచ్చింది. మాట మీద నిలబడ్డ అతను దేవుడమ్మా ..." నీతిని బోధించాలని అతని ప్రయత్నం.

ఆ పిల్ల నవ్వు ఆపి అంది:

"కాదు, బాబాయ్. తన తండ్రి అసమర్థుడు. పిన తల్లి ద్వేషంతో కోరరాని కోరిక కోరింది. అటువంటప్పుడు నిజం తెలియచెప్పాలికాని, చెప్పినదే తడువు అలా పారిపోతే ఎలాగ? చూడు, శ్రీరాముడి ఈ పనివల్ల గదా పాపం, దశరథ మహారాజు చనిపోయాడు? సీతమ్మ తల్లికి అన్ని కష్టాలు వచ్చాయి?"

ఆ పిల్ల కళ్లనిండా సీతమ్మ మీద ఎనలేని సానుభూతి.

అలా తన గుండెల మీద కూర్చుని కథలు వింటున్న అనుపమ హఠాత్తుగా పెరిగిపోయింది.

• • •

"అప్పుడప్పుడు ఎందుకు, బాబాయ్, ఇంత అసంతృప్తీ, నిరాశా అకారణంగా కలుగుతాయి?" ఈ ప్రశ్నకు జవా బేముంటుంది?

"ఈ జీవితంతో సంతృప్తి పడకుండగా, ఇంకేదో జీవితం కావాలని ఆరాట పడతాము. ఇంకొక తమాషా ఏమంటే, బాబాయ్, ఈ ఆనందమైన క్షణం జారిపోతుందనే వేదనతో అనుభవం తాలూకు మధుర స్మృతులను దాచుకోవడమే మరిచిపోతున్నాం."

ఆమె చెప్పేదానిని తన్మయతతో వింటున్నా డతను. ఆమె కీ శిక్షా సంస్కారాలు ఎవరు బోధించారు?

పధ్నాలుగు సంవత్సరాల వయస్సులో మహాకవులైన లీలాశుడు, కాళిదాసు, భవభూతి, భారవి-ఆమె మేధలో తారాడారు. మహాగాయకులైన త్యాగరాజు, తాన్‌సేన్ ఆమెకు ఆరాధ్యులైనారు. క్షేత్రయ్య, దీక్షితులు, శ్యామశాస్త్రిగారల పవిత్రభావాలు మనస్సులో చోటు చేసుకున్నాయి.

అర్ధరాత్రి కట్టుబట్టలతో, భార్యాబిడ్డలను వదిలి కానల కేగిన గౌతమబుద్ధుడంటే ఆమెకు సానుభూతి మెండు.

"బుద్ధుడు స్వార్థపరుడు కాదంటావా, మన్నూ?"

బాబాయి ప్రశ్నకు రెండు నిమిషాలు ఆలోచించి జవాబు చెప్పిం దామె:

"స్వార్థంకాదు, బాబాయ్! అమితంగా ప్రేమించిన భార్యను, బిడ్డను వదిలి వెళ్లాలంటే అది గొప్ప త్యాగమే అవుతుంది. కాని, అప్రయత్నంగా కలిగిన విరక్తిలో అది త్యాగమో, స్వార్థమోకూడా గుర్తించే స్థితిలో లే డతను. తన సౌఖ్యాన్ని, శాంతిని, మనుష్యత్వాన్ని భార్యాబిడ్డలలో చూసుకోగల అతను వాళ్లను పోగొట్టుకుని బికారి లయ్యాడు. కాకపోతే చరిత్రలో నిలిచిపోయాడు" అని నిట్టూర్చి, "మంచిమీద మమకారం కలవాళ్లంతా చరిత్ర కెక్కరు, బాబాయ్!" అంది.

మౌనంగా ఉన్న బాబాయిని చూస్తూ మళ్లీ తనే అంది:

"ఒక తమాషా చెప్పనా, బాబాయ్? నా కొక స్నేహితురాలు ఉండేది. దానిని గడిచిపోయిన క్షణం తాలూకు మచ్చ ఒకటి క్షణం క్షణం బాధిస్తుండేది. ఆ రహస్యాన్ని భర్తనుండి దాచుకోవడానికి అది చాలా అవస్థలు పడింది. అతను ఆ రహస్యం తెలిస్తే హింసిస్తాడనే భయంతో, అది దానిని అతి జాగ్రత్తగా దాస్తూందని నే ననుకునేదానిని. కాని, బాబాయ్!, నాకు దాని ఆఖరి క్షణాల్లో అసలు నిజం తెలిసింది. అది కన్ను మూశాక అతనేం చేయలేడని తెలిసికూడా

"పనిలో చేరిన మొదటి రోజునే ఇంత అజాగ్రత్తగా పూలకుండీలు, అద్దాలు పగలకొడితే ఎలాగే! కొంచెం ఒళ్లు దగ్గిరుంచుకుని పని చెయ్."

"మాటలు జోరుగా రానీయకం డమ్మగారూ. నెలాఖరున నా కిచ్చే జీతంలో నే పగలకొట్టిన సామాన్ల ఖరీదు తీసేసుకుని మిగిలిం దివ్వండి. నా జీతంకంటె వాటి ఖరీదే ఎక్కువైతే చెప్పండి. డబ్బులు చెల్లిం చేస్తాను."



అది ఆ రహస్యాన్ని వెల్లడి చేయలేదంటే, దానికి మంచి మీద ఎంత మమకారమో, చూడు! నిజం, బాబాయ్! ఆ మమకారమే లేకపోతే చాలామంది చెడ్డవాళ్ళే అయ్యేవారు.''

ఎదిగిపోతున్న తన అన్న కూతురును కళ్ళప్పగించి చూస్తూ కూర్చున్నా డతను. ఆమె చెప్పిన ప్రతి మాటలోనూ నిజం ఉంది. కాని, ఆ నిజాలను ఆ పసిపిల్ల నోటవెంట అతనికి వినాలనిపించలేదు. మానసికంగా చాలా తొందరగా ఎదిగిపోతూం దామె. దానికి ఆనకట్ట వేయాలనే ప్రయత్నంతోనే ఒక రోజు ఆమె పార్టీకి తనతో వస్తానంటే అడ్డు చెప్పాడు.

''అది డ్రింకింగ్ పార్టీ, తల్లీ! నువ్వు భరించలేవు, అనూ!''

''నన్నొకమారు చూడనీ, బాబాయ్!'' బాబాయిని బ్రతిమలాడుకుని ఆయనతో బయలుదేరింది.

మొదట్లో చాలా సంస్కారయుతంగా, అతి నాగరికులుగా ఉన్న ఆ మనుష్యులు;, తాగిన మైకంలో ఏమి మాట్లాడుతున్నారో తెలియనిస్థితిలో అడవి మనుష్యుల్లా ప్రవర్తిస్తుంటే జాలివడింది. అన్ని విషయాలు తెలుసుకోవాలనే జిజ్ఞాసతో బయలుదేరిన ఆమె ఆ వాతావరణానికి సర్దుకోలేకపోయింది. తాగినంతసేపూ తాగి, వాంతి చేసుకుని మంచాని కడ్డంగా తెలివిలేని స్థితిలో పడి పోయిన వాళ్లను చూచిన ఆమె హృదయం బాధతో నిండుకున్నట్లయింది. ఎందు కిలా జరిగింది? ఫలితం తెలిసి ఎందుకు తాగుతారు వీళ్ళు? నిండుకున్న గుండెలలో నీరసం ఆవరించింది ఆమెను. ఆ నీరసానికి, ఉత్తేజానికి తట్టుకోలేక మూల కెళ్ళి వెక్కి వెక్కి ఏడ్చింది.

ఎవరికోరకో కన్నీరు కారుస్తున్న అన్నకూతురును ఆశ్చర్యంగా, జాలిగా చూస్తున్నాడతను.

'అనుపమ ఒక్కమారుగా అజ్ఞానంలోనుండి విజ్ఞానంలోనికి జారబడటానికి చేసే ప్రయత్నంలో, ఆ జిజ్ఞాసలో మనశ్శాంతిని పోగొట్టుకుంటుంది' అనుకున్నాడు మనసులో.

● ● ●

''బాగా ఆలోచించుకో, తల్లీ!''

''ఏమి ఆలోచించను, బాబాయ్?'' ఆమె కళ్ళు రెపరెపలాడాయి.

''నిజం చెప్పాలంటే అతను నా కెందులోనూ సరిపోడు. అతను ఏమంత అందగాడు కాడు.''

ఆమె సన్నగా నవ్వింది.

''నా ఊహాపథంలో సుందరుడూ, మనోహరుడూ అయిన ఒక అద్వితీయ పురుషుణ్ణి, నా ఎక్కువ విలు బెట్టుకుని,క్షణాల్లో నాభావిజీవితాన్ని పొదిగి, అనుభూతి పొందిన మాట నిజమే, బాబాయ్! ఇప్పుడు అందులో ఏ ఒక్కటీ నిజం కాకపోయినా నేను చింతించడం కాని, నిరాశ పడటంకాని లేదు. ఎందుకంటే నా కానాడే తెలుసు — ఇవన్నీ ఊహలు మాత్రమేనని.''

''పోనీ, అనూ! అటువంటి వాడికొరకు నువ్వెందుకు వేచి ఉండకూడదు? తొందర ఏముంది ఇందులో?''

ఆమె మాట్లాడలేదు. కొద్దిసేపు అయ్యాక నిట్టూర్చి అంది:

''నా ఊహాపురుషుడు సాత్త్వికుడుకూడా! అందమూ, సాత్త్వికతా ఒకచోట కలవడం చాలా అరుదు. నా కళ్ళలోకి ఆరాధనాపూర్వకంగా చూడగలిగినవాడు అందగాడు అయిఉండడని నా నమ్మకం.

''ఇంకొక విషయం, బాబాయ్! వాళ్ళు ఎంత అందగాళ్ళయినా సరే, నన్ను ప్రేమించని వాళ్లను నేను మనసా ప్రేమించలేను. కాగా, అలా నటించాల్సి వచ్చినప్పుడు నే నెంత బాధపడతానో నువ్వు ఊహించు.'' విరక్తిగా నవ్వి వినీవినిపించనట్టు అంది:

''పోనీ, బాబాయ్! అతని కళ్లలో నా పట్ల ఉన్న ఆరాధన చాలు- ఈ జీవితాన్ని గడిపివేయటానికి.''

''ఆరాధించడమే కాదు, హింసించడంకూడా అతనికి వచ్చు.''

''బాబాయ్!'' ఉలిక్కిపడింది అనుపమ.


''నీ కెలా తెలుసు, బాబాయ్?''

ఆమె స్వరంలోని మార్పుకు అతను విచలితుడయ్యాడు.

''అదికాదు. నా ఉద్దేశం అది కాదమ్మా! అతను తాగుతాడు. ఆ తాగుడు మైకంలో. . .''

ఆమె గట్టిగా గాలి పీల్చుకుంది. ఆ నాడు అతని ముఖంలో ధీరత్వాన్నీ, సాత్త్వికతనూ ఏకకాలంలో చూడగలిగింది. ఆరాధనాపూర్వకమయిన అతని చల్లటి చూపులకు తన హృదయాన్ని పారవేసుకుంది. ఇప్పుడు అతనిని కాదనుకుని అశాంతిని భరించేకంటే, శారీరక





శిల్పసుందరి          ఫోటో—ఎమ్. ఎస్. మూర్తి (అహమదాబాద్-9)

మైన బాధ ననుభవించడం నయం. సంతృప్తి అన్నా మిగులుతుంది.

"తాగినప్పుడు అతను పసివాడితో సమానం. ఆ సమయంలో అతను ఎటువంటి ఘోరం చేసినా, ఆ తరవాత అత నెలా మరిచిపోతాడో, నేనూ అలాగే మరిచిపోతాను. పోనీ, మరిచిపోవాలి. అంతకంటే గత్యంతరం లేదు."

అతను తన గురువు, శిష్యురాలు అయిన అనుపమ గురించి ఆలోచిస్తున్నాడు.

'ఆ నాడు పార్టీలో తాగినవాళ్ళకొరకు సానుభూతితో వెక్కి వెక్కి ఏడ్చిన ఈ పిల్ల, దీనిని ఎలా భరించగలదు?

'అనుపమ ఎదిగింది!' తనను తాను సర్దిచెప్పుకోవ డానికి ప్రయత్నిస్తున్నా డతను.

"పోనీలే, తల్లీ! నువ్వతనిని మలుచుకుందువుగాని. నా కా నమ్మక ముంది."

"అదేమిటి, బాబాయ్, అలా అంటావు? ఎవరిని ఎవరు మటుకు మార్చగలరు?"

"అయితే. . ." తన అన్న కూతురు ఆంతర్యం ఆయనకు బోధపడలేదు. ఆమె నవ్వింది నిండుగా.

"సంశయం వద్దు, బాబాయ్! నా అనుమానం నాకు తెలుసు. నేను అతనిని అతనిగానే నా జీవితం లోకి ఆహ్వానిస్తున్నాను. అతను మారుతాడనే ఆశతో నేను ఈనాడు అంగీకరిస్తే... బాబాయ్, నేను తరవాత చింతించాల్సి ఉంటుంది."

"ఆ సంగతి నాకు తెలుసు, అమ్మా తల్లీ!"

"బాబాయ్!" ఆగింది ఆమె.

"నిరాశలోనూ, చెడులోనూకూడా నన్ను సంతృప్తిని వెతుక్కోనీ, బాబాయ్. నిరాశను ఆశగా, చెడును మంచిగా మార్చాలని పొందే తాపత్రయంలో కలిగే అశాంతికంటే ఇదే బాగుంటుంది, బాబాయ్!"

* * *

"తమాషా చూడు, బాబాయ్! పొద్దుట పోస్టు అందుకున్నాను. అందులో ఆయన ఉత్తరం రాలేదని నిరాశ పడడంకూడా అయిపోయింది. కాని, ఇప్పుడు సినిమానుండి తిరిగి వెళ్ళేసరికి తలుపు సందులో ఆయన వ్రాసిన ఉత్తరం నా కెదురుపడుతుందని ఆశ."

"క్షణక్షణం అతని తలపులే నీలో ఆ ఆశను కలిగిస్తాయి, అమ్మా! అతని జ్ఞాపకాలనుండి నీకు విముక్తి లేదు. అంతే!"

"కాదు, బాబాయ్! నే నాయనను తలుచుకోని క్షణమే లేకపోతే సినిమాలో నే నెందుకు లీనమయ్యాను? ఆయన దూరమైనా నా కెందుకీ సుఖానుభూతులు? నేను గాఢంగా ప్రేమించేది ఆయనని భ్రమపడ్డాను. కాని, నిజానికి నేను ప్రేమించేది నా శరీరాన్ని. నన్నే, బాబాయ్!" ఆమె వెక్కివెక్కి ఏడుస్తూంది.

"అమ్మా! పిచ్చితల్లీ! ఏడుస్తున్నావా? ఇన్నాళ్లకు అతని కొరకు నువ్వు పడ్డ బాధను కన్నీళ్లలో జారుస్తున్నావా?"

"లేదు, బాబాయ్! ఈ జీవితం-నా కర్థం కాకుండగా నన్ను భయపెడుతూంది. దానిని గూర్చి తెలుసుకోవాలనే తపన నాలో మిగిలిపోయింది. దానిని కనుక్కోవడానికి మార్గం లేదు. ఆ అశాంతి ఉప్పెనలా నన్ను ధహించి వేస్తుంటే ఏమీ చేయలేక మీ రన్నట్లు స్త్రీని,

అలలు—ఇంతకంటే ఏమి చేయలేక కన్నీళ్లు కారుస్తున్నాను.

"ఎంత పొందినా ఈ పాపిష్ఠిమనసుకు సంతృప్తి లేదు. ఆయనమండి నేను పొందని వరం లేదు. ఇంకా ఆయననే వేదిస్తాను." ఆమె కంఠంలో కన్నీళ్లు కదలాడాయి.

"ఇన్ని పుస్తకాలు చదివాను. ఎందులోనూ నాకు మహాసంతృప్తి మిగల్లేదు. ఇంకా శూన్యంగా ఏదో మిగిలిపోతూనే ఉంది.

"వ్యామోహం మనిషి బ్రతుకును సర్వనాశనం చేస్తోంది. మహాకల్లోలం, యుద్ధం—ఒక చిన్న భూ భాగం కొరకు. దానివల్ల ఎందరు అభాగ్యులవు



తమాషా

ఫోటో—ఎస్. బి. తకాల్‌కర (కొల్హాపూర్)

తున్నారో! ఆ అభాగ్యులు ఎన్ని కన్నీటిబొట్లు రాలుస్తున్నారో ఊహించడానికికూడా వ్యవధి లేని బ్రతుకులు.

"అజ్ఞాని అజ్ఞానిగా ఉండగానే, ముష్టివాడు ముష్టివాడుగా ఉండగానే శాస్త్రజ్ఞులు ఏదో ప్రగతి సాధించామని భుజా లెగరేస్తున్నారు. వాళ్లను. . . వాళ్లను ఒక్కమారు చెయ్యి పట్టుకుని లాక్కొచ్చి, బలవంతంగా కళ్లు తెరిపించి ఈ ప్రపంచాన్ని చూపించాలని ఉంది."

ఆమె చెప్పుకుపోతూంది. అతను వింటున్నాడు.

"ఒక శాస్త్రజ్ఞుడు తను కనిపెట్టిన 'థియరీ' గురించి ఇచ్చిన ఉపన్యాసం తాలూకు గొంతునెప్పి ఇంకా తగ్గకుండానే, ఇంకొకడు అతనిది తప్పనినా, అసలు 'థియరీ' ఇదని ఇంకొకటి చెప్తాడు. దీనికి అంతు అపూ లేదు. మనం పరుగులు పెడ్తున్నామనుకుంటున్నాము. కానీ, ఒక్క అడుగుకూడా మనం ముందుకు పోవడంలేదు."

అతను ఆలోచిస్తున్నాడు. 'ఈ పసిపిల్ల వయసుకు మించి ఆలోచిస్తోంది. ఆమె ఏమి ఆలోచిస్తోందో ఆమెకే సరిగా తెలియదు. మాటలకు, ఆలోచనలకు పొందిక లేదు. ఏదో తెలుసుకోవాలనే ఆరాటం మాత్రం ఉంది. అనుభవంలేని ఆమె ఆలోచనలు ఆమెకు శూన్యాన్ని మాత్రమే మిగులుస్తున్నాయి. ఆ శూన్యాన్ని ఆమె భరించలేకుండగా ఉంది. ఏమీ తెలియని ఆమెకు అన్ని తెలుసుకోవాలనే తపన హఠాత్తుగా కలిగింది. కానీ, తెలుసుకోవడానికి ఆమె వయస్సు చాలడం లేదు. వయస్సు ఎదిగేవరకూ ఆలోచనలు ఆగడం లేదు. ఆ రెండింటికీ మధ్య ఆమె నలిగి పోతూంది.

పిపాసిని అయిన స్త్రీకి శాంతి లేదు.' నిట్టూర్చాడతను.

* * *

చేతులు జోడించి భగవంతునికి నమస్కరిస్తున్న అనుపమ, తలుపు చప్పుడుకు ఇటు తిరిగింది.

"దేవుని ధ్యానించుకో, తల్లీ! నేను తరవాత వస్తాను."

"లేదు, లేదు. రా, బాబాయ్! పర్వాలేదు."

"ఇంత చిన్నవయసులో నీకు ఎంత భక్తి, తల్లీ!"

ఆమె నవ్వింది.

"భక్తి అంటే ఏమిటి, బాబాయ్?"

"ప్రతి నిత్యమూ భక్తితో దేవుని పూజించే నీకు, నాస్తికుడనైన నేను భక్తి గురించి బోధించాలా, అమ్మా!"

"వద్దు, బాబాయ్! దీనికి భక్తి అని పేరు పెట్టుకుని, నన్ను నేను మోసం చేసుకోను. సర్వం త్యజించి, పరిసరాలు మరిచి లీనమై పోవాలి కాని, తలుపు చప్పుడుకు ఉలిక్కిపడే పూజలో ఏమాత్రపు భక్తి ఉందంటావు? మనకు దొరికే కొన్ని నిమిషాలు ఇంత శాంతికొరకు భక్తి అని పేరు పెట్టుకుని చుట్టూ ఉన్న వాళ్లని మోసంచేసి, మనల్ని మనం మోసం చేసుకుంటున్నాము. ఇందులో కాస్త, కూస్త పాపభీతికూడా ఉంది. భగవంతుడినుండి పొందాలనే ఆరాటమే కాని, ఆయన కొరకు కొన్ని నిమిషాలుకూడా త్యాగం చేయలేని మనం ఏపాటి భక్తులమంటావు!"

అతను వింటున్నాడు మౌనంగా.

"బాబాయ్! మనలనందరినీ నడిపించే శక్తి ఒకటుందని నేను నమ్ముతాను. దానికి భగవంతుడు అని పేరు పెడితే నాకు అభ్యంతరం లేదు. కానీ, బాబాయ్, నేను నమ్మే సత్యంలో నే నెందుకు లీనం కాలేకపోతున్నాను, చెప్పు, బాబాయ్? ఎవరిలో ఉంది ఈ లోపం?"

అతను జవాబు చెప్పలేదు. ఇంకొక రోజు అతనికి ఎదురుగా వచ్చి కూర్చుంది అనుపమ.

"కొందరిని చూస్తే ప్రేమించ బుద్ధేస్తుంది. కొందరిని చూస్తే ద్వేషించ బుద్ధేస్తుంది. నిజానికి నువ్వు ప్రేమించేవాళ్లు మంచివాళ్లు, ద్వేషించేవాళ్లు చెడ్డవాళ్లు కాదు. ఇలాంటి పొందికలేని భావాలు ఎలా కలుగుతాయి, బాబాయ్?"

"ఈ ప్రశ్నకుకూడా నా దగ్గర జవాబు సిద్ధంగా లేదు, తల్లీ!" నిట్టూర్చాడతను.

'ఈ విశాలమయిన ప్రపంచంలో ప్రతి ఒక్కరి ఉచ్ఛ్వాస, నిశ్వాసాలనూ తానే మోయాలని ప్రయత్నించి మానసికంగానూ, శారీరకంగానూకూడా నీరసించి పోయింది అనుపమ.'

ఆమె జ్ఞానసత్రం పూర్తిగా జ్యోతిర్మయ మవక ముందే, విశిష్టమూ, అపురూపమూ అయిన వ్యక్తిత్వం కల ఆ పసిపిల్ల అస్తమించింది. అంతవరకూ ఆమె అదృష్టవంతురాలే!

పదిహేడు సంవత్సరాలు నిండకుండగానే అతి లేలికగా ఆమె మాతృమూర్తి అయింది. కానీ, రెండు సంవత్సరాల తరవాత ఈనాడు తన భావావేశం ప్రసవవేదనలో మాత్రం స్పృహ కోల్పోయిం దామె. అందులోనుండి కోలుకోకుండగానే తన ప్రయాణాన్ని మధ్యలోనే మలుపు తిప్పి, దూర తీరాలకేసి సాగి పోయింది.

మృత్యుద్వారం ముంగిట నిల్చుని అర్థించింది అనుపమ, తన బిడ్డను అతని చేతుల్లో ఉంచి:

"దీనిని నాకు వారసురాలిని చేయకు, బాబాయ్!"

ఆమె కళ్లనిండుగా వాత్సల్యం. తాను పోగొట్టుకున్న శాంతిని తన నెత్తురుగుడ్డుకయినా ఇవ్వాలని ఆరాటం.

అతని కళ్లగుండా అవిరామంగా జారిపోతున్న నీళ్లను తుడుస్తూ అంది:

"నువ్వు పుట్టినప్పుడు నేను లేను. నువ్వు పోయే నాటికి నేను ఉండను. ఈ నాలుగువాళ్ల నా పరిచయానికే కన్నీళ్లు కారుస్తున్నావా?"

"అమ్మా తల్లీ!" ఆమెను పెనవైచుకుని బావురుమన్నా డతను.

ఆమె కళ్లలో తడి లేదు. పెదవులమీద తడి లేదు. ఎండిన పెదవులమీద బలవంతంగా చిరునవ్వు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తూ చెప్పిం దామె:

"బాబాయ్! ఇప్పుడనిపిస్తోంది—పిచ్చిగా ఫస్ట్‌ఫారంలో నాన్నకు ట్రాన్స్‌ఫర్ అయినప్పుడు ఒక్క నెల పరిచయస్థులనే విడిచిపోవడానికి ఎందుకంత ఏడ్చానా అని. ఈ నాడు నా బంధువుల నందరినీ శాశ్వతంగా విడిచి వెళ్లిపోవాల్సి ఉంటుందని తెలిసి ఉంటే, ఆ కన్నీళ్లను ఈనాటికి దాచుకుని ఉండేదాన్ని."

"అమ్మా, ఇంత తొందరగా వెళ్లిపోకు, తల్లీ! ఈ ముసలివాడికి తోడెవరమ్మా?"

తన సర్వస్వాన్ని కోల్పోతున్న అతను పూర్తిగా ముసలివాడై పోయాడు.

"బాబాయ్!" అతని కళ్లలోకి ప్రేమగా, వాత్సల్యంగా అదేపనిగా చూస్తూం దామె.

ఆమె గాజుకళ్లలో చిన్న నీటిపొర.

"నాకూ వెళ్లాలని లేదు. కానీ, పిలుపు వచ్చింది, బాబాయ్!" తనకు ఎదురువస్తున్న క్షణాల్లో మృత్యుదేవత నివాసముందని ఆమెకు తెలుసు.

'భగవంతుడా! ఎంత అన్యాయం! నీ దగ్గరకు రావాలని లేని ప్రాణాన్ని నువ్వెం చేసుకుంటావు? నాకు వదిలెయ్యి!' అతను మూర్ఛపోయాడు. స్మృతి తప్పిన అతని చేతిలోని ఆమె చెయ్యి చైతన్యరహితమై పోయింది.

అందరినీ దుఃఖసాగరంలో ముంచి, ఆమె ఆలోచనా రహితమైన ప్రపంచంలోకి జారిపోయింది. తన మధురమైన జీవితాన్ని అర్థంలేని ఆలోచనలకు, ఎడతెగని పిపాసకు బలి పెట్టుకుంది. జిజ్ఞాసతో మనసును కాల్చేసుకుని తన జీవితకాలాన్ని కుంచించుకుం దామె. ★